

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

కేశంపేట, ఆగస్టు 11: అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకర్ శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు పెట్టకుండా అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని అన్నారు. పదేళ్లుగా రేషన్ కార్డులు లేక చాలామంది అర్హులు ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరిట ఉన్న కార్డులను తొలగించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. అర్హులందరికీ కార్డుల ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- అదును దాటుతున్నా చేపపిల్లల పంపిణీ కరువు
- ఆలస్యంతో ఎదుగుదలపై తీవ్ర ప్రభావం
- జిల్లాలో నేటికీ పూర్తికాని టెండర్ల ప్రక్రియ
- బిల్లులు అందక వెనకడుగు వేస్తున్న కాంట్రాక్టర్లు
- ఈ ఏడాది 1.93 కోట్ల పిల్లల పంపిణీకి ప్రతిపాదన
- త్వరగా పంపిణీ చేయాలంటున్న మత్స్యకారులు
- ఆందోళనలో గంగపుత్ర కుటుంబాలు

అసలే అరకొర వర్షాలు. చెరువు, కుంటల్లోనూ అంతంతమాత్రమే నీళ్లు. అయినా చేప పిల్లల పంపిణీపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. నేటికీ జిల్లాలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదును దాటుతున్నా చెరువుల్లో చేప పిల్లలను వేయకపోవడంతో ఆలస్యమవుతున్నా కొద్దీ చేపల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా పంపిణీ ప్రక్రియ చేపట్టాలని గంగపుత్రులు కోరుతున్నారు. అలాగే ఈ ఏడాది ఉచితంగా కొర్రమట్ట పిల్లలను సైతం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా186 మత్స్య సహకార సంఘాల్లో 9,136 మంది సభ్యులు ఉన్నారు.



చెరువుకు చేరని చేప!



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11): సీజన్ దాటిపోతున్నా జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. చెరువు, కుంటల్లో ఉన్న నీరు కూడా ఇంకిపోతుండటంతో మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విధితమే. కాగా, టెండర్లకు కాంట్రాక్టర్లను ఇప్పటికే రెండు సార్లు ఆహ్వానించినా ఎవరూ ముందుకు రాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గతేడాదికి సంబంధించి గుత్తేదార్లకు చెల్లించాల్సిన బిల్లులు ఇంకా పెడింగ్‌లో ఉండటంతో ఈసారి టెండర్ వేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. టెండర్లలో పాల్గొనాలంటే టెండర్ ఫీజు, ఈఎండీ, చేపపిల్లల కొనుగోలు, రవాణా తదితర వాటికి పెట్టుబడి అవసరం. బకాయిలు విడుదల చేయకపోవడంతో వారు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కాగా, రేపు(13వ తేదీ) మరోసారి టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది 813 చెరువుల్లో 1.93 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

సంవత్సరం	పంపిణీ చేసిన చేప పిల్లలు(లక్షల్లో)	ఖర్చు (రూ.లక్షల్లో)
2016	10.10	18
2017	99.74	63.10
2018	27.69	21.54
2019	70.54	33.06
2020	129.05	70.23
2021	163.13	117.19
2022	163.13	117.19
2023	162.35	114.60

కనీసం ఆరు నెలల సమయం..

పూర్తిగా నీటితో నిండిన చెరువుల్లో 45 రోజుల వయసున్న 35 - 40 మి.మీ పొడవు చేప పిల్లలు, ఏడాది మొత్తం నీరు ఉండే పెద్ద చెరువుల్లో 75 రోజుల వయస్సున్న 80-100 మి.మీ పిల్లలను వదులుతారు. నీటిలో వదిలిన తర్వాత కిలో సైజులో చేప పెరగాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలైలో వదిలితేనే డిసెంబర్ నెల నుంచి రెండు, మూడు నెలల పాటు వాటిని పట్టి విక్రయించవచ్చు. ఆలస్యంగా వదిలితే ఎదుగుదలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. సెప్టెంబరులో వదిలితే కిలో సైజుకు పెరగాలంటే ఫిబ్రవరి వరకు ఆగాల్సిందే. ఇంకా పెరగాలంటే వేసవి వస్తుంది. ఎండ కారణంగా ఆ చేపలు నీటిలోనే చనిపోయే ప్రమాదముందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ లేని రకాలే దిక్కు

జిల్లాలో ఏటా సుమారు 1.62 కోట్ల ఉచిత చేప విత్తనాలను మత్స్యశాఖ పంపిణీ చేస్తుంది. అయితే డిమాండ్ ఎక్కువగా ఉన్న కొర్రమీను లాంటివి కాకుండా బొచ్చ, రవ్వ చేప పిల్లలను మాత్రమే చెరువులు, కుంటల్లోకి వదులుతుది. ధర ఎక్కువ కావడంతో జాతి చేప పిల్లలను కొనుగోలు చేయలేమంటూ మత్స్యశాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా కొర్రమట్ట పిల్లలను పంపిణీ చేయాలని గంగపుత్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఏటా ఆలస్యంగానే..

గతేడాది (2023-24) సెప్టెంబరులో రూ.1.33 కోట్లతో 1.96 కోట్లు చేప విత్తనాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, 114.60 లక్షల ఖర్చు పెట్టి 162.35 లక్షల చేపపిల్లలను 868 చెరువుల్లో వదిలారు. కాగా, ఏటా టెండర్ విధానంపై కాంట్రాక్టర్లు కోర్టులను ఆశ్రయించడంతో పంపిణీ ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. జూలైలో విత్తన పంపిణీ చేయాల్సి ఉండగా మూడు నెలలు ఆలస్యంగా ప్రారంభమవుతోంది. దీంతో చెరువుల్లో నీటి మట్టం తగ్గి, చేపలు పెరిగే అవకాశం తగ్గిపోతుంది. ఈ ఏడాది 813 చెరువుల్లో 1.93 కోట్ల చేప విత్తనాలు వదిలేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెలాఖరు వరకు చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

నిధుల పక్కదారిపై అనుమానాలు

మత్స్యశాఖ అందించే చేపలను ఆంధ్రప్రదేశ్ నుంచి టెండర్ ద్వారా కొనుగోలు చేసి తీసుకొస్తున్నది. చెరువుల్లో చేప పిల్లలను వదలకుండానే లెక్కల్లో మాత్రం పంపిణీ చేసినట్లు రికార్డుల్లో చూపుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేప విత్తనాల పంపిణీలో పెద్దఎత్తున నిధులు దారి మళ్లుతున్నాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ జిల్లా అధికారి సుకీర్తి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆమెపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాకు ఇన్‌చార్జి అధికారిని నియమించారు.

మొత్తం 186 సహకార సంఘాలు

జిల్లాలో 186 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. వీటిలో 18 మహిళా సంఘాలు ఉన్నాయి. మార్కెటింగ్ సహకార సంస్థలు 6, అన్నింటిలో కలిపి మొత్తం 9,136 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో మొదటి విడతగా ఇప్పటి వరకు 48 నూతన మత్స్య పారిశ్రామిక సంఘాల ఏర్పాటు చేశారు. అలాగే రెండో విడతలో 20 సంఘాలను వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించి ఏర్పాటు చేశారు.

కొనుగోలు హక్కును సొసైటీలకు ఇవ్వాలి



అదును దాటాక చేప పిల్లలు ఇస్తే ఏం లాభం. ప్రభుత్వం ఇచ్చే సీడ్ కూడా నాసిరకంగా ఉంటుంది. పంపిణీ చేసే చేప విత్తనాల లెక్కల్లో భారీ తేడా ఉంటుంది. క్షేత్రస్థాయిలోకి పిల్లలు చేరకుండానే నిధులు స్వాహా అవుతున్నాయి. ప్రభుత్వం నేరుగా సొసైటీలకు అవకాశం కల్పిస్తే, అవసరమైన చేపలను పెంచుకునే వీలుంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా ఏటా మూడు నెలలు ఆలస్యంగా చేప విత్తనాలు అందుతున్నాయి. గతంలో ఇబ్రహీంపట్నం, రావిర్యాల చెరువులో వేసిన రొయ్య విత్తనాలు కల్తీ వచ్చాయి.

-గోరెంకల నర్సింహ, మత్స్య సహకార సంఘం జిల్లా చీఫ్ ప్రమోటర్

త్వరగా పంపిణీ చేయాలి



త్వరగా చేప పిల్లలను పంపిణీ చేయాలి. సీజన్ దాటి పోయాక ఇస్తే ప్రయోజనం లేదు. ఇప్పుడు సీడ్ చెరువుల్లో వేస్తే చేపలు పెరగవు. చేప పిల్లల పంపిణీకి బదులుగా మత్స్య సహకార సంఘాలకు నగదును బదిలీ చేయాలి. అలాగే మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కొర్రమీను పిల్లలను పంపిణీ చేస్తే లాభసాటిగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదలాలి.

-తవిటి యాదగిరి, ఆరుట్ల మత్స్య సొసైటీ అధ్యక్షుడు

813 చెరువుల్లో పంపిణీకి ఏర్పాట్లు



మత్స్యశాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాల సభ్యులకు ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది జిల్లాలో 813 చెరువుల్లో 1.93 కోట్ల చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 13న చేపపిల్లల టెండర్ల కోసం మరోసారి గుత్తేదారులను ఆహ్వానిస్తున్నాం. టెండర్లు పూర్తి కాగానే చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

-నర్సింహారావు, ఇన్‌చార్జి జిల్లా అధికారి

షాద్‌నగర్ అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పట్టణంలోని వ్యాపారులతో చర్చలు

షాద్‌నగర్, ఆగస్టు, 11: భవిష్యత్తు తరాలకు అవసరమైన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని షాద్‌నగర్ పట్టణ అభివృద్ధికి వ్యాపారులు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రతీ దుకాణం దగ్గరకు వెళ్లి ఈ విషయమై వ్యాపారస్తులతో మాట్లాడారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారస్థులు తమవంతు సహకారం అందించాలన్నారు. పట్టణంలో రోడ్ల విస్తరణ చేయకపోవడంతో కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. రోడ్లు విశాలంగా లేకపోతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇందుకోసం షాద్‌నగర్ పట్టణ ప్రధాన రహదారిని విస్తరించాల్సిన అవసరం ఉందని వారికి వివరించారు. రోడ్లు ఇరుకుగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణ జనాభా కూడా ప్రతీ సంవత్సరం పెరుగుతుందని, అందుకు అనుగుణంగా రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు భీష్వ కిష్టయ్య, బక్కని నర్సింలు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నేత అందె బాబయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, తదితరులు ఉన్నారు.



వ్యాపారస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యేలు

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

షాద్‌నగర్, ఆగస్టు 11: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులో అక్రమంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని బీజేవైఎం డిమాండ్ చేసింది. ఆదివారం పలువురు నాయకులు పట్టణ సీఐ విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు వెంకనోళ్ల వెంకటేశ్ మాట్లాడుతూ ఎలికట్ట గ్రామ శివారులో కొంతకాలంగా హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా క్రైస్తవులు ప్రార్థనలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం, భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు రుషికేష్, విర్యాల నర్సింహ, గిరి, ప్యాట వంశీ, శ్రవణ్, సందీప్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



శిథిలావస్థలో మండల పరిషత్ సిబ్బంది క్వార్టర్లు

ఆమనగల్లు, ఆగస్టు 11: నిర్వహణ లేక సర్కారు ఆస్తులు నిర్లక్ష్యం పాలవుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు వినియోగించక శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులు చేస్తే పలు భవనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ చొరవ చూపని దుస్థితి. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ సమితి కాలంలో వ్యవసాయ పరికరాలు, కార్యాలయ వస్తువులు, రైతులకు ఉపయోగపడేలా రెండు చోట్ల మూడు గోదాంలు నిర్మించారు. వాటిని దశాబ్దాలుగా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తుంది. వాటిని నిల్వ చేయడానికి ఈ గోదాంలను వినియోగించవచ్చు.

మూగజీవాలకు ఆవాసంగా..

దశాబ్దాల క్రితం పంచాయతీ సమితి సిబ్బంది కోసం నిర్మించిన నివాస గృహాలు సైతం నిర్వహణలేక శిథిల స్థితికి చేరాయి. కొన్నింటిని మరమ్మతుల చేయించినా మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయి. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పాత పశువుల దవాఖానా భవనం కూడా అలాగే ఉంది. ఆసుపత్రికి కొత్త భవనం నిర్మించి పాత భవనాన్ని వదిలేశారు. దీంతో అది మూగజీవాలకు ఆవాసంగా మారింది. అలాగే విద్యుత్ కార్యాలయం సమీపంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవనం, అంగడీ బజారులో మాంసం విక్రయ కేంద్రం, చేనేత సంఘం భవనం పరిస్థితి కూడా ఇదే దుస్థితి. పలు చోట్ల సామూహిక భవనాలు సైతం బిక్షగాళ్లకు ఆవాసంగా మారాయి. మార్కెట్ యార్డ్‌లోని రైతు విశ్రాంతి భవనం, క్యాంటీన్, ఇలా భవనాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. ఈ భవనాలు, గోదాంలను అలాగే వదిలేస్తే స్థలాలు కూడా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం లేకపోలేదని స్థానికులు వాపోతున్నారు.



నిరుపయోగంగా గోదాం



పాత పశువుల ఆస్పత్రి భవనం



ఇరిగేషన్ శాఖ భవనం

అసైన్డ్ భూములను కాపాడాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 11: జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి సర్వే నం.189, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో సర్వే నం.281లోని అసైన్డ్ భూములను సీపీఎం నాయకుల బృందం పరిశీలించింది. గతంలో రైతులకిచ్చిన ఈ భూములను కొందరు రియల్టర్లు కబ్జా చేస్తున్నారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బృందంలో సీపీఎం నాయకులు సామేల్, జగదీష్, జంగయ్య, జగన్, బుగ్గరాములు, వెంకటేశ్, ఆనంద్ తదితరులున్నారు.



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

40 టన్నుల రేషన్ బియ్యం సీజ్

- రాజరాజేశ్వరి మిల్లు యజమానిపై కేసు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడంతో పాటు కొనుగోలు చేస్తున్న రాజరాజేశ్వరి రైస్ మిల్లును సీజ్ చేసి పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ తెలిపారు. ఆయన ఆదివారం రాష్ట్ర విజిలెన్స్ బృందంతో కలిసి రంగారెడ్డి జిల్లా పెద్ద గోల్కొండలోని రాజరాజేశ్వరి రైస్‌మిల్లులో అక్రమంగా పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ పెద్ద గోల్కొండ, శంషాబాద్ తదితర ప్రాంతాల నుంచే కాకుండా కందుకూరు, కడ్తాల్, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి సైతం రేషన్ బియ్యంను కొనుగోలు చేసి ఈ మిల్లులో డంప్ చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. దాదాపు 40 టన్నులకు బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మిల్లు నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.



రైస్ మిల్లులో పట్టుబడిన బియ్యం



సీత్లా సంబురం

యాచారం మండలం మంతన్ గౌరెల్లి గ్రామంలో గిరిజనులు ఆదివారం సీత్లా పండగను వైభవంగా నిర్వహించారు. తమ కులదైవానికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి పుట్ట వద్ద పాలు పోసి పూలదండలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారంతా ర్యాలీగా వెళ్తూ నృత్యాలు చేస్తూ అలరించారు. పండగ సందర్భంగా గ్రామమంతా బంధువులతో కళకళలాడింది. ఈ సందర్భంగా ఆడపడచులకు వడి బియ్యం పోసి సత్కరించారు. యాచారం, ఆగస్టు 11



ర్యాలీగా వెళ్తున్న గిరిజనులు

సండే.. సందడి!

తాండూరు, ఆగస్టు 11 : సెలవురోజు కావడంతో తాండూరు పట్టణం సమీపం చెన్‌గేశ్‌పూర్ రోడ్డులోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ఆవరణంతా సందడిగా మారింది. ప్రతి నెలా రెండో ఆదివారం తమ పిల్లలను చూసుకునేందుకు తల్లిదండ్రులు వస్తుండడంతో సందడిగా మారింది. పాఠశాల ఆవరణలో చెట్లకింద కూర్చొని విద్యార్థినుల బాగోగులను తల్లిదండ్రులు అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి భోజనాలు చేశారు. తిరిగి సాయంత్రం ఇళ్లకు వెళ్లిపోయారు.



గురుకులం ఆవరణలో తల్లిదండ్రులతో కూర్చున్న విద్యార్థినులు

పేద విద్యార్థులకు చేయూత



నాటి ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తాండూరు, ఆగస్టు 11: తాండూరు విజయ విద్యాలయ హైస్కూల్‌లో 1985-1986 సంవత్సరం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో చదివే బీద విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, దుస్తులు పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. ఆదివారం వీవీహెచ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తలో చెయ్యి వేసి తాము చదివిన పాఠశాలలోని బీద విద్యార్థులు 50మందికి స్కూల్ యూనిఫామ్, దుస్తులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సిద్ధన్న, నారాయణ, లలితలను సన్మానించారు. 39ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కులకచర్ల, ఆగస్టు 11: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు అన్నారు. పరిగి డిపో ఆధ్వర్యంలో ఆదివారం ముజాహిద్‌పూర్ గ్రామంలో కార్గో సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ అధికారులు అందిస్తున్న కార్గో సర్వీస్ సేవలు గ్రామానికి వచ్చాయని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చంద్రభూపాల్‌రావు, అనంతయ్య, శ్యామ్‌రావు, అరవింద్, చంద్రయ్య, వెంకటయ్య, పులింగ వెంకటేశ్, షర్ఫొద్దీన్, కార్గోసెంటర్ ఇన్‌చార్జి విశ్వనాథ్, వసంత్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆంజనేయులు

హైవేపైనే పార్కింగ్!

● ప్రతిపాదనలకే పరిమితమైన పార్కింగ్ హబ్



44వ నంబర్ జాతీయ రహదారి పక్కన పార్క్ చేసిన ట్రక్కులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 : రోజూ హైదరాబాద్‌కు సరుకులు తరలించే వాహనాలకు పార్కింగ్ స్థలం లేక ట్రక్కులు, ఇతర గూడ్స్ వాహనాల డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోకి నోఎంట్రీ టైమ్‌లో రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్‌కు తలపెట్టిన పార్కింగ్ హబ్ ప్రతిపాదనలకే పరిమిమైంది. దీంతో జాతీయ రహదారి పరిసరాలే పార్కింగ్ స్థలంగా మారింది. ఇది వచ్చీపోయే వాహనాలకు ప్రమాదకరం అని తెలిసినా నో ఎంట్రీ సమయాల్లో హైవే పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. మేడ్చల్ వైపు నుంచి నగరానికి వెళ్లే రూట్లో ఓఆర్ఆర్ వరకు గల జాతీయ రహదారి పక్కన వందలాది లారీలను నిలుపుతున్నారు. నాగ్‌పూర్-బెంగళూరు 44వ జాతీయ రహదారిపై నుంచి రోజూ వేలాది సరుకు రవాణా వాహనాలు వెళ్తుంటాయి. ఉత్తర భారత రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు సరుకు రవాణాకు 44వ నంబర్ జాతీయ రహదారి ప్రధానమైంది. పీక్ సమయాల్లో భారీ వాహనాలకు హైదరాబాద్‌లోకి నో ఎంట్రీ ఆటంగా మారింది. సరుకు రవాణా వాహనాలు ప్రవేశ సమయం కోసం వేచిచూస్తూ రింగ్ రోడ్డు పక్కన నిలుపుతున్నారు. ప్రస్తుతం భారీ వాహనాలకు రాత్రి 9గంటల నుంచి ఉదయం 8:30గంటల వరకు అనుమతిస్తున్నారు. నగర పరిసర ప్రాంతాలకు వెళ్లే లారీలకు ఉదయం 11:30నుంచి సాయంత్రం 4గంటల వరకు అనుమతిస్తున్నారు. మిగితా సమయాల్లో భారీ వాహనాలను అనుతించరు. దీంతో నగరంలోకి చేరుకోవాల్సిన ట్రక్కులు అనుమతి సమయం వరకూ మేడ్చల్ జాతీయ రహదారి పరసరాల్లో నిరీక్షిస్తున్నాయి. రోడ్డు పక్కన పార్కింగ్ నేరం అన్న విషయం తెలిసినా గత్యంతరం లేక లారీలు, మినీ ట్రక్కులను రోడ్డు పక్కన నిలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులకు జరిమానాలు చెల్లిస్తున్నారు.

పార్కింగ్ హబ్ ఏర్పాటు ఉట్టిదేనా?

44వ నంబరు జాతీయ రహదారిపై నగరానికి చేరుకోవాల్సిన సరుకు రవాణా వాహనాలను నో ఎంట్రీ సమయాల్లో నిలుపుకునేందుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమమైంది. రోడ్డు పక్కన వాహనాల నిలుపుదలతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని నివారణకు పోలీసులు గతంలో రింగ్‌రోడ్డు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ హబ్ ఏర్పాటు చేసి వేచి ఉండే డ్రైవర్లకు సదుపాయాలు కల్పించాలని ప్రతిపాదించారు. అయితే రింగ్ రోడ్డు సరిసరాల్లో ప్రభుత్వం స్థలం లేక ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

దోచుకుంటున్న ప్రైవేట్ పార్కింగ్ నిర్వాహకులు

నగరంలోకి భారీ వాహనాల నో ఎంట్రీ సమయంతో వాహనదారుల అవసరాలను ఆసరాగా

● వాహనాలు నిలిపే స్థలం లేక ఇక్కట్లు

చేసుకుని కొందరు రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో పెయిడ్ పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకుని లారీ డ్రైవర్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. 24గంటల పార్కింగ్‌కు రూ.300-500 వసూలు చేస్తున్నారు. దీంతో వాహనదారులు డబ్బులు చెల్లించలేక రోడ్డు సరిసరాల్లో, రింగ్ రోడ్డు పక్కనున్న సర్వీసు రోడ్డుపై లారీలను నిలుపుకుంటున్నారు. నగరానికి సరుకుల లోడ్‌తో వచ్చిన వాహనాలు అన్‌లోడ్ చేసి తిరిగి తమ సొంత ప్రాంతాలకు వెళ్లే సమయంలో లోడ్ లభించే వరకు వేచి ఉంటారు. వారు పెయిడ్ పార్కి ంగ్‌లో డబ్బులు చెల్లించలేక రోజుల తరబడి రోడ్డు పక్కనే లారీలను నిలిపుకుంటున్నారు.

రోడ్డు పనులతో మరిన్ని ఇబ్బందులు

ప్రస్తుతం మేడ్చల్‌లో హైవేపై వంతెన పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పరిసరాల్లో విచ్చలవిడిగా నిలుపుతున్న వాహనాలతో ట్రాఫిక్ జామైతోంది. దీనికి తోడు మేడ్చల్ చెక్‌పోస్టు ప్రాంతంలో పలు ట్రాన్స్‌పోర్టు కంపెనీల ట్రక్కులను రోడ్డు పక్కనే రోజుల తరబడి పార్క్ చేస్తున్నారు. మేడ్చల్ నుంచి రింగు రోడ్డు వరకు పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు, ఆస్పత్రులున్నాయి. విద్యార్థుల రాకపోకలు, సాధారణ ప్రయాణికులతో హైవే రద్దీగా ఉంటుంది. లారీల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య రెట్టింపవుతోంది. సరుకు రవాణా వాహనాలకు జాతీయ రహదారి సమీపంలో పార్కింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక వాహనదారులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దుకాణాల వద్ద వాహనాల నిలిపివేతతో ఇబ్బందులు

ఆమనగల్లు: ఆమనగల్లులో రహదారుల పక్కనే పార్కింగ్‌కు అడ్డాగా చేసుకోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మధ్యలో వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల వద్ద ఎక్కడ పడితే అక్కడ గంటల తరబడి ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌లతో కొన్ని చోట్ల ప్రయాణికులకు నడిచేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా అక్రమ పార్కింగ్‌లతో తరచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముందే ఆక్రమణలతో రోడ్లు కుంచించుకుపోగా దానికి తోడు ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చౌక్ నుంచి సాయిరాం మెడికల్ హాల్ వరకు, ఆమనగల్లు-మాడ్గుల రోడ్డులో గాంధీచౌక్ వరకు, షాద్‌నగర్ రోడ్డులో సురసముద్రం చెరువు కట్ట వరకు రోడ్ల పక్కనే పార్కింగ్‌లతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కూడా అవుతోంది. దుకాణాల వద్ద ఇప్పటికే చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. దుకాణాలు, చిరు వ్యాపారుల వద్దకు వచ్చే కొనుగోలు దారులు రోడ్డు మధ్యలోనే వాహనాలు నిలుపుతున్నారు. కొందరు వాహనాలను గంటల తరబడి రోడ్డుపై నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్ వద్ద కల్వకుర్తి వైపు రోడ్డు ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌తో బస్సులు సైతం తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఉన్నా డబ్బులు చెల్లించాల్సి వస్తుందని ద్విచక్ర వాహనదారులు రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. ఇలాంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు రహదారిపై హడావుడి చేస్తున్నారు తప్పితే ట్రాఫిక్ నియంత్రణకు, వాహనాల అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు అంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు సైరన్ వేసుకొని కారులో వెళ్లడమే తప్ప కారు దిగి వాహనదారులకు చెప్పడం లేదంటున్నారు. రోడ్లపై పార్కింగ్ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆమన్‌గల్‌లో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న బైక్‌లు

బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన బీజేపీ నాయకులు



విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 11: బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌహాన్‌ను చేవళ్ల మండల బీజేపీ నాయకులు మార్యపూర్వకంగా కలిశారు. ఆదివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన రోహిత్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, సురేంద్రశర్మ, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు మాల్గరి వైభవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, కృష్ణ, దామోదర్ ఉన్నారు.

మేడ్చల్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్



శంభీపూర్ రాజు నుంచి నియామక పత్రం అందుకుంటున్న భాస్కర్ యాదవ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11: మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం భాస్కర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేసి పార్టీ బలోపేతానికి పాటుపడతానని భాస్కర్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలోకి ... వరద నీరు



పాఠశాల గేటు వద్ద ఏర్పడిన నీటి మడుగు

కొందుర్గు, ఆగస్టు 11 : రెండు గ్రామాల నుంచి వచ్చే వర్షపు నీటితో పాఠశాల ప్రాంగణం నీటి కుంటలా మారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపూర్ పంచాయతీ పరిధి సోమారంపాడ్, అలాగే మహదేవ్‌పూర్ పంచాయతీ పరిధి అయ్యవారిపల్లి ఈ రెండు పంచాయతీలకు హామ్లెట్ గ్రామాలు. రెండు గ్రామాలకు కలిపి అయ్యవారిపల్లిలో ప్రాథమిక పాఠశాల ఉంది. వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల్లో కురిసిన వర్షపు నీరు నేరుగా ప్రాంగణంలోకే వస్తోంది.

● విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇక్కట్లు

స్కూలు గేటు వద్ద పెద్ద మడుగులా తయారైంది. నీటి గుంత నుంచి వెళ్లలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, వర్షపు నీరు పాఠశాలలోకి వెళ్లకుండా కట్ట కట్టించడమో లేక ఎత్తుగా సీసీ రోడ్డు వేయడమో చేయాలని విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



బురదమయంగా పాఠశాల ఆవరణ

సైడ్‌వాల్ కూలి ప్రమాదకరంగా రోడ్డు

కొందుర్గు, ఆగస్టు 11 : కల్వర్టు రక్షణ గోడ కూలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనాదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని శ్రీరంగాపూర్ శివారులో షాద్‌నగర్-పరిగి వెళ్లే రోడ్డులో కల్వర్టు ఉంది. గత సంవత్సరం కురిసిన వర్షాలకు కల్వర్టు గోడ కూలిపోయింది. రోడ్డు ఎత్తుగా ఉండి వాహనాలు పడిపోయే ప్రమాదం ఉండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు సైడ్‌వాల్‌ను కట్టించారు. అయితే కొన్నాళ్లకే కల్వర్టు గోడ మళ్లీ కూలింది. ఈ రోడ్డుపై కొత్తగా వచ్చే వాహనదారులకు ఇక్కడ రోడ్డు ప్రమాదకరంగా ఉన్న విషయం తెలియాలంటే కల్వర్టుకు సైడ్ వాల్ కట్టాల్సిందే. షాద్‌నగర్-పరిగి ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి కల్వర్టు గోడను మరోసారి నాణ్యతతో నిర్మాణం చేయించాలని అధికారులను వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద కూలిపోయిన రక్షణ గోడ





ఘనంగా తీజ్ వేడుక



తీజ్ సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, స్థానికులు

ఘట్‌కేసర్, ఆగస్టు11: కుల మతాలకతీతంగా అందరి పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని బ్యూటీనెస్ట్ లే అవుట్‌లోని పార్కు స్థలంలో గోర్ బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ సంబరాల్లో వారు పాల్గొన్నారు. బంజారాలు భక్తి శ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకుంటారని అన్నారు. బ్యూటీనెస్ట్ వెంచర్‌లోని పార్కు స్థలాన్ని కేటాయించాలని వారు కోరిన విషయమై ప్రజాప్రతినిధుల, నాయకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అతిథులను బంజారాలు సన్మానించారు. తమ సంప్రాదాయం ప్రకారం ప్రత్యేక బుట్టల్లో గోదుమలను వేసి నిత్యం ఉదయం, సాయంత్రం నీళ్లు పోస్తారు. ఆ బుట్టలను బతుకమ్మలుగా భావించి నిత్యం ఆటపాటలతో పూజలు చేస్తారు. తొమ్మిదో రోజు మహిళలు మొలకెత్తిన ఆ బుట్టలను నెత్తిన పెట్టుకొని సంప్రాదాయ బద్ధంగా నృత్యాలు చేస్తూ ఆటపాటలతో చెరువులు కుంటలకు వెళ్లి బుట్టలను నిమజ్జనం చేస్తారు. తీజ్ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించిన బంజారాలు అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొక్క సంగీతప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొంతం అంజిరెడ్డి, మామిండ్ల ముత్యాలయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ శోభారాణి, రాధాకృష్ణ, కె.కుమార్, బొక్క జంగారెడ్డి, జె.రమేష్, కె.నాగరాజు, నిర్వాహకులు రాములునాయక్, డీజీ.నాయక్, చరణ్‌దాస్, శంకర్, పురుషోత్తం, అధిక సంఖ్యలో బంజారా మహిళలు పాల్గొన్నారు.

ఉర్స్-ఎ-షరీఫ్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు, ఆగస్టు 11: తాండూరులోని సయ్యద్ అబ్దుల్ కరీం సాహెబ్ ఖిల్లా ఉర్స్-ఎ-షరీఫ్ 78వ ఉత్సవాల పోస్టర్‌ను మున్సిపల్ కౌన్సిలర్ నీరజా బాల్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ 17 నుంచి మూడురోజులు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు హబీబ్‌లాల, వలీ పాషా, సలీమ్ పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో గల సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 11వ గ్రాడ్యుయేషన్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్లోబల్ హెడ్, ఎంటర్‌ప్రైజెస్ క్లౌడ్ అప్లికేషన్ వైస్‌ప్రెసిడెంట్ అమర్‌నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందుకుసాగాలన్నారు. కరస్పాండెంట్ శ్రీశైలంరెడ్డి, వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలతో పాటు తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఉన్నత విద్యనభ్యసించి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో 949 మంది గ్రాడ్యుయేట్లు, 1,800మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్స్‌పాల్ శ్రీనివాసులరెడ్డి, జంగారెడ్డి, నారాయణరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు హాజరయ్యారు.



◄ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ శ్రీశైలంరెడ్డి



పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులు

పదోన్నతులను పూర్తి చేయాలి

కొడంగల్, ఆగస్టు 11: సర్వీస్ రూల్స్ అమలుతో ఎంఈవో పోస్టులు, పదోన్నతులను పూర్తి చేయాలని ఎస్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. హైదరాబాద్‌లోని కాచిగూడలో ఆదివారం జరిగిన ఎస్టీయూ రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీహెచ్ఎం, జేఎల్ పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న జీవోలను అభయన్స్‌లో పునరుద్ధరించాలన్నారు. బీఎడ్ చేసిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో నష్టం జరగడంతో సీనియారిటీ ప్రకారం జీవో 11, 12లను సవరించి పదోన్నతులు కల్పించాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యుడు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దు


కొడంగల్, ఆగస్టు 11 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. ఆయన కొడంగల్‌లో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంసకు అప్పగిస్తే కార్మికులు జీవనోపాధిని కోల్పోతారని దుస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వం భోజన కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, వెంకటమ్మ, అంజమ్మ, జయమ్మ, రాములమ్మ, లావణ్య, సరళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య

‘స్థానిక’ ఎన్నికలకు సమాయత్తం కావాలి

కడ్తాల్, ఆగస్టు 11: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. అవినీతి, ఆరాచక పాలనతో ప్రజావిశ్వాసాన్ని కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం కాక తప్పదని చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు స్థానిక సమస్యలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలని అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పని చేయాలని ఆయన కోరారు. ప్రతీ కార్యకర్తకు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నికల అనంరతం బీజేపీ, బీఆర్ఎస్‌లకు రాష్ట్రంలో ఉనికే లేకుండ పోతుందని అన్నారు. ఆ పార్టీలను ప్రజలను నమ్మడం లేదన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ బలీయమైన శక్తిగా ఎదిగిందని, ఇది ఎన్నికల్లోనూ నిరూపితమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను, వారి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నాలుగు రాష్ట్రాల్లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకు పార్టీ నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, అశోక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబలు వంశీచంద్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, విజయ్, పాండు, తులసీరాంనాయక్, బాలరాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి



అవార్డు అందుకుంటున్న గంతల భృంగీశ్వర్

గంతల భృంగీశ్వర్‌కు
సువర్ణ కంకణ అవార్డు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 11: షాద్‌నగర్ పట్టణానికి చెందిన గంతల భృంగీశ్వర్‌ను లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ సువర్ణ కంకణ అవార్డుతో సత్కరించింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లోని హరిహర కళాభవన్‌లో శ్రీకృష్ణ సేవా సంస్థాన్ సాలగ్రామ తేజో విభూషణ్ డాక్టర్ శ్రీకృష్ణ చాముడేశ్వర మహర్షి, సీవీ రామన్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఆదివారం అవార్డును అందుకున్నట్టు భృంగీశ్వర్ తెలిపారు. శివాలయంలో ప్రధాన పూజారిగా పనిచేస్తున్న తనకు సువర్ణ కంకణంతో పాటు ప్రశంసాపత్రాన్ని సైతం ప్రదానం చేశారని తెలిపారు. భృంగీశ్వర్‌ను సువర్ణ కంకణంతో సత్కరించడం పట్ల ఆయన తల్లిదండ్రులు గంతల నాగలక్ష్మి, ప్రభులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ఆమనగల్లు, ఆగస్టు 11: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహద పడుతుందని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రతీ ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. పట్టణంలోని చింతల కొండారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కిరణ్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి ఓపెన్ టు ఆల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ రాష్ట్ర నాయకుడు జనార్దన్‌రెడ్డితో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరాటే విద్యార్థులు ప్రదర్శించిన కరాటే ప్రదర్శనలు అలరించాయి. నాయకులు శ్రీనివాస్ యాదవ్, దారమోని గణేశ్, సురేశ్, సురేందర్, నాగరాజు, భీమయ్య, కృష్ణ, గంగాధర్ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఉప్పల వెంకటేశ్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, ఆగస్టు 11: మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఈర్లపల్లి పెంటమ్మ కుటుంబాన్ని ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ ఎంపీటీసీ పాలకుర్ల ఉమావతి బుగ్గయ్యగౌడ్ పరామర్శించారు. పెంటమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ. 2 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వ పరంగా తగిన సాయం అందేలా చూస్తానని హామి ఇచ్చారు. పరామర్శించిన వారిలో నాయకులు వెంకటేశ్, మల్లేశ్, ప్రకాశ్, శ్రీశైలం, మహేశ్, శేఖర్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

బీబీగేడు దర్గాను అభివృద్ధి చేయండి

- ముస్లిం వెల్ఫేర్ జామా మజ్జిద్ కమిటీ
- ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేత

షాద్‌నగర్, ఆగస్టు 11: కుల, మతాలకు అతీతంగా పూజింపబడుతున్న బీబీగేడు దర్గాను అభివృద్ధి పర్చాలని ముస్లిం వెల్ఫేర్ జామా మజ్జిద్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు జమీల్ అహ్మద్ మాట్లాడుతూ కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ సమీపంలో ఉన్న అతి పురాతనమైన బీబీగేడు దర్గాలో గత 300 సంవత్సరాల నుంచి ఉత్సవాలు జరుగుతున్నా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రతీ సంవత్సరం మొహర్రం ఉర్సే షరీఫ్ ఉత్సవాలు జరుగుతాయని, ఈ వేడుకలకు సమీప గ్రామాలైన సంతాపూర్, కోనాయపల్లి, రావిచేడు, అల్వాల్, కేశంపేట నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారని పేర్కొన్నారు, కానీ, దర్గాకు రావడానికి సరైన రోడ్డు మార్గం, విద్యుత్తు, నీటివసతి లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కేశంపేట మండలంలో ఉన్న ఏకైక దర్గా.. అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి దర్గాను అన్నివిధాలా అభివృద్ధి పరుస్తామని, కరెంట్ సౌకర్యం కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వెల్ఫేర్ కమిటీ ఉపాధ్యక్షులు రఫిక్ అహ్మద్, రజాక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం వెల్ఫేర్ నాయకులు

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 11: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నగర శివారు ప్రాంతాలకు సమాంతరంగా ఆమనగల్లు మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విద్యానగర్ కాలనీలో విద్యుత్ లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధి దీపాలు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, కమ్యూనిటీ హాల్, వాటర్ పైపులైన్ ఏర్పాటు చేయాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ పాషా, ఉపాధ్యక్షుడు వర్కాల శేఖర్, కోశాధికారి సుదర్శన్ రెడ్డిలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డి పల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు పాడైన సింగిల్ రోడ్డును మరమ్మతు చేసి డబుల్ రోడ్డుగా విస్తరించాలని పోలెపల్లి మాజీ సర్పంచ్ బాల్‌రామ్, నాయకులు గుద్దేటి శ్రీనివాస్, వగ్గు వెంకటయ్య , కసిరెడ్డి బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, భగవాన్ రెడ్డి, జంగయ్యలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. రోడ్డు మరమ్మతు ఆధునీకరణకై నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కసిరెడ్డి చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి రూ.180 కోట్లు మొదటి విడత మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అసంపూర్తి పనులన్నీ పూర్తిచేసి వీలైనంత త్వరగా ప్రజలకు వినియోగంలోకి తెస్తామని అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. కాగా, ఇటీవల అగ్నిప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆప్పారెడ్డిపల్లికి చెందిన మహేందర్‌ను ఎమ్మెల్యే పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, నర్సింహగౌడ్, భగవాన్‌రెడ్డి, పర్వతాలు, విజయ్‌రాథోడ్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి పాటుపడాలి

కడ్తాల్, ఆగస్టు 11: గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్‌పతి నాయక్ కోరారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి గిరిజనులు అంతా ఏకతాటిపై నిలిచి సంఘటితంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సేవలాల్ సేనా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కడ్తాల మండలం పోచమ్మగడ్డ తండాకు చెందిన లక్‌పతి నాయక్‌కు ఆదివారం బాలాపూర్‌లో అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాండు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన నేతలు, సేవాలాల్ సేన నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. లక్‌పతి నాయక్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ చూపిన మార్గాన్ని అనుసరించి గిరిజనులంతా ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వ పథకాలలో గిరిజనులకు పెద్ద పీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు నాయక్, టీక్‌లాల్ నాయక్, తారాసింగ్, గోపాల్‌నాయక్, సీతారామ్, చిన్న, దేవేందర్, రవి, సాయి, మాణిక్‌రెడ్డి, విఘ్నేశ్‌రామ్, మహేందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లక్‌పతి నాయక్ ను సన్మానిస్తున్న గిరిజన నేతలు

క్రైం కార్నర్

మాటువేసి.. కత్తులతో దాడి
యువకుడిని తీవ్రంగా గాయపర్చిన దుండగులు

- ఆస్పత్రికి తరలించిన పెట్రోలింగ్ పోలీసులు.. పరిస్థితి విషమం
- పరారీలో నిందితులు
- మాడ్గుల మండలం ఆర్కపల్లిలో పోలీసుల పికెట్

మాడ్గుల, ఆగస్టు 11 : ఇద్దరు వ్యక్తులు ఓ యువకుడిపై కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన మండలంలోని సుద్దపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మాడ్గుల మండలంలోని ఆర్కపల్లి గ్రామానికి చెందిన పందుల లింగం, అదే గ్రామానికి చెందిన యాచారం బిక్కు శనివారం రాత్రి బైక్‌పై సుద్దపల్లి వైపు వెళుతున్నారు. అంతకుముందు పందుల లింగంపై దాడి చేసేందుకు సుద్దపల్లి సమీపాన చింతచెట్టు వద్ద యాచారపు జగతయ్య, పందుల బాల్‌రాజు కల్లు గీసే కత్తులతో లింగంపై దాడిచేసేందుకు వేచి చూస్తున్నారు. లింగం, బిక్కులు సుద్దపల్లి సమీపంలోకి రాగానే జగతయ్య, బాల్‌రాజులు ఒక్కసారిగా లింగంపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు లింగం తండ్రి పందుల రాములు తెలిపాడు. అయితే, లింగం తప్పించుకోవడానికి యత్నించగా విచక్షణారహితంగా దాడిచేశారు. ఈక్రమంలో లింగం చనిపోయాడని భావించిన జగతయ్య, బాల్‌రాజులు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. కాగా, అంతకుముందు బిక్కు భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న లింగంను సుద్దపల్లికి చెందిన మమత చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వెంటనే లింగం తండ్రి రాములు అతడి తమ్ముని కుమారుడు వెంకటేష్‌తో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని లింగంను ఏం జరిగిందని అడిగారు. యాచారపు జగతయ్య, పందుల బాల్‌రాజు కత్తులతో దాడిచేసినట్లు తెలిపాడు. అయితే, ఆ సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గమనించి లింగంను మాల్‌లోని పీపుల్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని మమత ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పందుల రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఆదివారం ఆర్కపల్లిని ఏసీపీ కేపీవీ రాజు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. దాడికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.



బాధితుడి ఇంటి వద్ద పోలీసులు

కుక్కల దాడిలో 4 మేకలు మృత్యువాత

తలకొండపల్లి, ఆగస్టు 11: కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నర్సింహ రోజూ మాదిరిగా వ్యవసాయ పొలం వద్ద దొడ్డిలో మేకలను ఉంచాడు. శనివారం రాత్రి కుక్కలు మందపై దాడిచేసి నాలుగు మేకలను చంపేశాయి. ఉదయం చంద్రయ్య దొడ్డి వద్దకు వెళ్లగా కుక్కలు అతడిపై కూడా దాడి చేయడానికి యత్నించగా వాటి బారినుంచి తప్పించుకున్నాడు. మృతిచెందిన నాలుగు మేకల విలువ దాదాపు రూ.40వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని చంద్రయ్య కోరాడు. ఈమేరకు డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి చంద్రయ్యను పరామర్శించాడు. చౌదర్‌పల్లిలో కుక్కల బెడదతో ప్రజలు, రైతులు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. కుక్కల బారినుంచి దూడలు, గొర్రెలు, మేకలను కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

మూడు తులాల బంగారం అపహరణ

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు11: షాద్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ నర్సింహ కాలనీలో శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. కాలనీలో నివాసముండే మల్లేష్ దంపతులు బంధువుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చేసేందుకు వెళ్లారు. శనివారం రాత్రి దొంగలు వారి ఇంటి తాళం విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి బీరువాను తెరిచారు. అందులో ఉన్న మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

కడ్తాల, ఆగస్టు 11 : మండల కేంద్రానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ కంబాలపల్లి అంజయ్య అదృశ్యమైనట్లు ఆయన భార్య మంజుల పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శివప్రసాద్ కథనం మేరకు.. అంజయ్య ఈనెల 8న ఉదయం తన భార్య మంజులతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో మంజుల శనివారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేశారు.



అంజయ్య

షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో యువకుడి హల్‌చల్

షాద్‌నగర్, ఆగస్టు 11: షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు రైలు పట్టాల పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన రమేష్ ఆదివారం రాత్రి 11గంటల సమయంలో తాగిన మైకంలో విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్యా యత్నానికి యత్నించాడు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న కొంతమంది అతడితో వారించారు. కానీ, రమేష్ వినలేదు. విషయాన్ని రైల్వే పోలీసులకు తెలియజేయడంతో వారు వెంటనే వచ్చి రమేష్‌ను స్తంభం నుంచి కిందికి దించారు. కాగా, అతడు తాగిన మైకంలో విద్యుత్ స్తంభం ఎక్కాడా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయం తెలియాల్సి ఉంది.

రక్తదానంపై అపోహలు వీడాలి



షాబాద్ : నాగర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో రక్తదానం చేస్తున్న నాయకులు

చేవెళ్ల/షాబాద్, ఆగస్టు 11 : అన్నిదానాల కన్నా రక్తదానం చాలా గొప్పదని పర్యావరణ అవార్డు గ్రహీత, సామాజిక వేత్త రామకృష్ణ తెలిపారు. రక్తదానంపై అపోహలు వీడాలని సూచించారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గాంధీ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో 100 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని చెప్పారు. శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని, ఆరోగ్యవంతులైన యువతీ యువకులు మూడు నెలలకొసారి రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, యువకులు పాల్గొన్నారు. కాగా, అన్నిదానాల్లో ప్రాణాలను నిలిపేది రక్తదానం ఒక్కటేనని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సిద్దాపురం ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడలో శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, వికారాబాద్ వారికి 30 మంది రక్తదానం చేశారు. లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్, విజయ దంపతులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం ఆకలి తీరుస్తుందని, రక్తదానం ప్రాణాన్ని నిలుపుతుందని అన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, రాజశేఖర్, రాఘవేందర్, శ్రీనివాస్, విక్రంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహిపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు(సోమవారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్వో ఎంఏ పాష తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వారికి ఉచితంగా ఐవోఎల్ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆమనగల్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పాష కోరారు.



చేవెళ్ల : రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలుకుదాం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణ కోసం దాదాపు 30వేళ్లుగా అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ ఈనెల 13న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నందున ఘన స్వాగతం పలుకుతూ విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు ఇబ్రహీంపట్నం నుంచి మాదిగలు భారీ సంఖ్యలో తరలి వెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు. ఆదివారం ఇబ్రహీపట్నంలో జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ తోపాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా చేసిన పోరాటానికి సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇవ్వడమనేది మంచి పరిణామమని నాయకులు అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా బషీరాబాగ్ చౌరస్తా బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, కృపేష్, వీరేశ్‌కుమార్, కొండ్రు ప్రవీణ్, కాల్ల జంగయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోను విజయవంతం చేయాలి

శంషాబాద్ : ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగే మంద కృష్ణమాదిగ రోడ్‌షోను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శంషాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ 30 సంవత్సరాల పాటు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వడం సంతోషదాయకమైన విషయమన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగలు ఏకమై ఎన్నోపోరాటాలు, ఉద్యమాలు చేశారని వివరించారు. మంద కృష్ణమాదిగ పోరాటం ఎంతో గొప్పదని కొనియాడారు. రోడ్‌షోలో మాదిగలంతా పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్.రాజు, బి.దర్శన్ఎం. మనోహర్, టి.స్వామి, బి.గణేష్, ఆర్.శివ, ఆర్.నందు, కె.రమేష్, ఆర్.నర్సింహ, కె.పరమేష్, పార్టీ జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, సుబ్బారావు కోరారు.

నేటి నుంచి మహనీయుల విగ్రహాల పరిశుభ్రత కార్యక్రమాలు

శంషాబాద్, ఆగస్టు 11 : నేటి నుంచి మూడు రోజుల పాటు బీజేపీ కార్యకర్తలందరూ జిల్లాలోని మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారని ఓబీసీ మోర్చా జిల్లా స్పోక్స్‌పర్సన్ గాజుల రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మహనీయులు, అమరవీరుల స్మారక చిహ్నాలు, విగ్రహాల వద్ద కార్యకర్తలందరూ పుష్పాంజలి ఘటించాలని రాహుల్ బీజేపీ కార్యకర్తలను కోరారు. ఈ నెల 13న ప్రతీ కార్యకర్త తమ ఇంటిపైన జాతీయ జెండాను కట్టాలని 14న గ్రామంలోని బీజేపీ కార్యకర్తలందరూ జాతీయ జెండాతో సెల్ఫీలు దిగి బీజేపీ ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని 15న స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా రాహుల్ కోరారు.

నేడు ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 11: షాద్‌నగర్ పట్టణంలో నేడు(సోమవారం) ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దిన వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు యువతీ యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పవన్ చౌహాన్ కోరారు.

21 నుంచి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 11: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య తెలిపారు. వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకుడు అందె శ్రీరాములు, మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేశ్, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాములకు వెంకటయ్య అందజేశారు. మూడు రోజుల ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, రాజు, యాదయ్య, సాయి, కేకే శ్రీను, అంజయ్య, మల్లయ్య, మల్లేశ్, చిన్న వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



రాముకు ఆహ్వానపత్రికను ఇస్తున్న వెంకటయ్య

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గణపురం సురధీర్

చేవెళ్ల, ఆగస్టు 11 : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నివేదికను తెప్పించుకుని ఉద్యోగులకు వెంటనే పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కార్పొరేట్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డు ద్వారా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన ఆయన కోరారు. ఎస్జీటీలందరికీ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ఆధారంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులదరికీ పాత పెన్షన్ సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గణపురం సురధీర్ ఈ సందర్భంగా ప్రభుత్వానికి విన్నవించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కేశంపేట, ఆగస్టు 11: ప్రతీ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ జిల్లా నాయకుడు కర్రెడ్ల నరేందర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో ఆదివారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి కనీసం మూడు మొక్కలు నాటాలని ఆయన కోరారు. వాతవరణ సమతుల్యం కోసం మొక్కలను నాటాలని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తుందని, ప్రజలు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శివలీల, ఆశా కార్యకర్త శంకరమ్మ, జ్యోతి, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు నరేందర్‌రెడ్డి

బీజేపీలో మాజీ వార్డుసభ్యుల చేరిక



బీజేపీలో చేరిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 11: శంషాబాద్ మండలంలోని పిల్లోనిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యులు రాజ్‌కుమార్, దివాకర్, గణేశ్‌తో పాటు ఐదుగురు రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఆయన నివాసంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గంతో దేవేందర్ తదితరులు

చేవెళ్ల, ఆగస్టు 11 : చేవెళ్ల మండల భవన నిర్మాణ కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం సీఐటీయూసీ డివిజన్ కార్యదర్శి దేవేందర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. చేవెళ్ల మండల భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా చక్రితో పాటు 15మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ లేబర్ సంక్షేమ బోర్డు నుంచి లేబర్ కార్డులు పొందాలని సూచించారు. ప్రభుత్వం అందించే బీమాను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికులకు సీఐటీయూ నిరంతరం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.